

వనమహోత్సవంలో మహిళలకు భోజనం వడ్డిస్తున్న దేవిరెడ్డి కమలాసుధీర్ రెడ్డి

కార్తీక వనభోజనాలతో మహిళల్లో ఐక్యత

●దేవిరెడ్డి కమలాసుధీర్ రెడ్డి

మన్సూరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీక వనభోజనాలతో మానసిక ప్రశాంతతతో పాటు స్నేహపూర్వక వాతావరణం, ముఖ్యంగా మహిళల్లో ఐక్యత నెలకొంటోందని జయచంద్రారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ దేవిరెడ్డి కమలాసుధీర్ రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ ఆటోనగర్‌లోని జింకల(డీర్) పార్కులో మంగళవారం కమలాసుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో 'మహిళామణుల కార్తీక వనభోజన మహోత్సవం'ను నిర్వహించారు. ఇందులో భాగంగా ముందుగా ఉసిరి చెట్టుకు దీపారాధన నిర్వహించి అనంతరం ఆటపాటలతో ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని డివిజన్ల బీఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాళ్లు, మాజీ మహిళా కార్పొరేటర్లు, ప్రముఖ మహిళలు, యువతులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

మన్సూరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని శ్రీసాయినగర్ కాలనీలో గల దుర్గాదేవి సహిత కాశీవిశ్వేశ్వర ఆలయంలో మంగళవారం ఆంజనేయస్వామికి 1008 వడమాల ధరింపజేసి పంచామృత ఫలరస అభిషేకం, 1008 తమలపాకులతో అర్చన నిర్వహించారు. ఆలయ పూజారి బాల మురళీశర్మ వేదమంత్రోచ్చరణల నడుమ ఆలయ చైర్మన్ పోచబోయిన గణేష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రంగారెడ్డిజిల్లా మహిళల కబడ్డీ జట్టు ఎంపిక రేపు

ఎల్బీనగర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ మహిళల (75కిలోల లోపు) రంగారెడ్డి జిల్లా జట్టు సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న ఈ సెలక్షన్స్‌లో ఎంపికైన క్రీడాకారిణులు డిసెంబర్ 7 నుంచి 10 వరకు నగరంలోని లాల్‌బహదూర్‌స్టేడియంలో నిర్వహించనున్న 71వ అంతర్ జిల్లా కబడ్డీ పోటీలలో రంగారెడ్డి జిల్లా తరఫున పాల్గొంటారన్నారు.సెలక్షన్స్‌లో పాల్గొనే వారు ఆధార్ కార్డు తీసుకుని రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు చంద్రమోహన్(7661992581),రాజు(9000038272)లలో సంప్రదిం చాలన్నారు.

శ్రావ్య మృతిపై విచారణ వేగవంతం చేయాలి

●మలక్‌పేట పోలీసులకు ఐద్వా వినతి

చాదర్‌ఘాట్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : మలక్‌పేటలోని జయదుర్గా కన్సల్టెన్సీ సంస్థలో శ్రావ్య(20) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటనపై పోలీసుల విచారణ వేగవంతం చేయాలని ఐద్వా హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి పి.శశికళ డిమాండ్ చేశారు. మంగళవారం ఆమెతో పాటు ఐద్వా ప్రతినిధులు కవిత, స్వరూపతో కూడిన బృందం మలక్‌పేట ఎస్‌ఐ సురేష్‌ను కలిసి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర రాజధానిలో గిరిజన యువతికి రక్షణ లేకుండా పోయిందన్నారు. సెలవు రోజైన ఆదివారం ఎవరూ పనికి రాని రోజున ఆ యువతిని ఎందుకు ఆఫీసుకు పిలిపించారో కూడా విచారణ చేపట్టాలన్నారు. సత్వరం నిష్పాక్షికంగా దర్యాప్తు చేసి శ్రావ్య బలవన్మరణానికి కారకులను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు.

విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చంపాపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బైరామల్‌గూడ విద్యుత్ సబ్‌స్టేషన్ 33/11కేవీ పరిధిలో మరమ్మతుల కారణంగా చంపాపేట సెక్షన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కేవీ శ్రీనివాసనగర్ ఫీడర్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్, శ్రీరాంనగర్, తపోవన్‌కాలనీ, గ్రీన్‌పార్కు కాలనీ రోడ్డు నంబర్ 1 నుంచి 7 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



సరూర్‌నగర్‌లో మాలల సింహగర్జన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన బేర బాలకిషన్ తదితరులు

మాలల సింహగర్జనను జయప్రదం చేయాలి

● తెలంగాణ మాలల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్

ఎల్బీనగర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నగరంలోని పరేడ్ గ్రౌండ్‌లో డిసెంబర్ 1న నిర్వహించ తలపెట్టిన మాలల సింహగర్జనను జయప్రదం చేయాలని తెలంగాణ మాలల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ పిలుపునిచ్చారు. మంగళవారం సరూర్‌నగర్ డివిజన్ భగత్ సింగ్‌నగర్‌లో మాలల సింహగర్జన పోస్టర్‌ను డివిజన్ మాల సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శి మాదాసు వెంకటేశ్‌లతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బేర బాలకిషన్ మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఉపయోగపడ్డ మాలలు కావాలో, లేక బీజేపీకి ప్రచారం చేసి కాంగ్రెస్ పార్టీని ఓడించమని బహిరంగంగా ప్రచారం చేసిన మంద కృష్ణ కావాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తేల్చుకోవాలన్నారు. ఎస్సీ రిజర్వేషన్లు ఎత్తివేయాలని మనవాదులు చేస్తున్న కుట్రలో మందకృష్ణను పావుగా వాడుకుని ఎస్సీ రిజర్వేషన్లు లేకుండా చేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదన్నారు. ఈ విషయాన్ని మాల, మాదిగలు గ్రహించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్గీకరణ మీద తన నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీనియర్ జర్నలిస్టు మేకల సత్యనారాయణ, పార్శపు శ్రీధర్, సరూర్‌నగర్ డివిజన్ మాల సంఘాల ఐక్యవేదిక జాయింట్ సెక్రటరీ మొగిళ్ల మల్లేష్, రాచమళ్ల గోపాల్, కోశాధికారి రామకృష్ణ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత చేప పిల్లలతో మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం ఉచిత చేప పిల్లలను పంపిణీ చేస్తుందని పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ చైర్‌పర్సన్ జయశ్రీరాజు, వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పెద్దఅంబర్‌పేట్ ఈదుల చెరువులో 30,900, కుంట్లూర్ పెద్ద చెరువులో 28 వేల చేప పిల్లలను వారు ముఖ్య అతిథిగా హాజరై వదిలిపెట్టారు. మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్ జోర్క గీతాశ్రీరాములు, ముదిరాజ్ సంఘం నాయకులు జోర్క రాముముదిరాజ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో..

అబ్దుల్లాపూర్ చింతల చెరువులో 12,600, అనాజ్‌పూర్ ఇందిరమ్మ చెరువులో 88 వేలు, ఇనాంగూడ భీరం చెరువులో12,600, పసుమాముల పోచమ్మ చెరువులో 27,900, తారామతిపేట పొల్కమ్మ చెరువులో 38 వేల చేప పిల్లలను వదిలిపెట్టారు. మొత్తం 8 చెరువుల్లో 2 లక్షల 90 వేల చేప పిల్లలను వేసినట్లు జిల్లా మత్స్య శాఖ అధికారి పూర్ణిమసింగ్ తెలిపారు.

ఆటో డ్రైవర్ అదృశ్యం



తారాసింగ్

● చనిపోతున్నానని భార్యకు వాట్సా‌ప్‌లో విషం బాటిల్ ఫొటో

హయత్‌నగర్, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): తల్లితో గొడవపడి ఆటో డ్రైవర్ అదృశ్యమైన ఘటన మంగళవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హయత్‌నగర్‌లోని బొమ్మలగుడి గ్రీన్‌సిటీ కాలనీలో రత్లావత్ తారాసింగ్ (22) భార్య పార్వతితో కలిసి నివాసముంటున్నాడు. మంగళవారం ఉదయం తారాసింగ్ తల్లి మంగ్లితో గొడవపడ్డాడు. దీంతో అతను తన భార్య పార్వతిని కూతురుతో పాటు పుట్టింటికి పంపించాడు. ఉదయం 9 గంటలకు భార్యకు ఫోన్ చేసి తాను విషం తాగి చనిపోతున్నానని చెప్పి ఆమె వాట్సాప్‌కు విషం బాటిల్ ఫొటో పంపించాడు. ఆ తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో ఆందోళనకు గురైన పార్వతి భర్త కోసం కుటుంబసభ్యులు, బంధువులను వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో మంగళవారం రాత్రి హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ నియోజకవర్గాల పరిధిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందించేలా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దిశానిర్దేశనంలో ఎందరో మేధావుల సారథ్యంలో రూపుదిద్దుకున్నదే భారత రాజ్యాంగమని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు.

● డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు పలువురి నివాళి



మన్సూరాబాద్‌లో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి తదితరులు

మహనీయుడు అంబేడ్కర్..

మన్సూరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మన్సూరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతగానో శ్రమించి భారత రాజ్యాంగాన్ని నిర్మించి వారికి బంగారు బాటలు వేసిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. బీజేపీ ఎల్బీనగర్ అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్, గడ్డిఅన్నారం కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, నాయకులు అంజన్‌కుమార్ గౌడ్, కసిరెడ్డి పద్మారెడ్డి, ఆనంద్‌కుమార్, పీతం ప్రదీప్‌కుమార్, విజయ్ భాస్కర్, జయప్రకాశ్ పాల్గొన్నారు.

బండ్లగూడలోని జీఎస్ఐలో..

బండ్లగూడలోని జీఎస్ఐలో సంస్థ హెడ్, డైరెక్టర్ హార్మోహన్ మిశ్రా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా తెలంగాణ శాఖ డైరెక్టర్ జనరల్ ఎల్పీ సింగ్ విచ్చేసి సంస్థ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంస్థ డిప్యూటీ డైరెక్టర్ రాజగోపాల్, సంస్థ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రీజనల్ సెక్రటరీ మధిర సత్యనారాయణ, సీఈసీ, ఆర్ఈసీ సంఘం ప్రతినిధులు శ్రీనివాసరావు, మేఘరాజ్, ఆనంద్ కుమార్, కిశోర్‌కుమార్, బి.లింగయ్య, జి.మల్లేష్, ఇ.చంద్రయ్య, చక్రేశ్వర్, ఎ.శివశంకర్, బి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా కోర్టుల ఆవరణలో..

రంగారెడ్డి జిల్లా కోర్టులు,ఆంధ్రజ్యోతి: రంగారెడ్డి జిల్లా కోర్టుల ప్రాంగణంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో సీనియర్ న్యాయవాదులు శ్రీనాథ్, మట్టపల్లి శ్రీనివాస్, పీఠం ప్రదీప్‌కుమార్, నరేష్, నగేష్, దర్శన్ విజయ్ నాయక్, గురువయ్య, కళ్యాణ్, బాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గౌరీష్, మాధవరెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముసారాంబాగ్‌లో..

చాదర్‌ఘాట్,ఆంధ్రజ్యోతి: ముసారాంబాగ్ కృష్ణతులసినగర్ కమ్యూనిటీహాల్‌లో రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ముసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షు డు దినేష్, యాదగిరి, సురేందర్, చందు, ప్రవీణ్ యాదవ్ పాల్గొన్నారు

హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

హయత్‌నగర్, ఆంధ్రజ్యోతి : హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి అధ్యాపక బృందం నివాళులర్పించింది. పొలిటికల్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగరాజుయాదవ్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ నర్సింహ, సుబ్రహ్మణ్యం, గంగాధర్, ఇందిరా, విద్యాసాగర్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



జీఎస్ఐలో అంబేడ్కర్‌విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సంస్థ తెలంగాణ శాఖ డైరెక్టర్ జనరల్ ఎల్పీ సింగ్ తదితరులు



జిల్లా కోర్టుల ఆవరణలో రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్న న్యాయవాదులు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి తదితరులు

తుర్కయంజాల్‌లో...

బీజేపీ తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో యంజాల్ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆ పార్టీ నాయకులు నివాళుల ర్పించారు. బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు బచ్చిగళ్ల రమేష్, కొంద్రు పురుషోత్తం, శ్రావణ్‌కుమార్ గౌడ్, కార్తీక్‌గౌడ్, ధరావత్ శ్రీనివాస్‌నాయక్, సుక్కయ్య, బాబునాయిని తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ కోటగా ఎల్బీనగర్

● పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

ఎల్బీనగర్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు పార్టీల చీలికల వల్ల దేశానికి మంచికంటే చెడే ఎక్కువగా జరిగిందని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సీపీఐ ఎల్బీనగర్ నియోజకవర్గం జనరల్ బాడీ సమావేశం మంగళవారం కొత్తపేటలోని బాబూజగ్జీవన్ రామ్‌భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు కావస్తున్న సందర్భంగా పార్టీ పోరాట చరిత్రను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం తర్వాత జరిగిన ఎన్నికల్లో ఎక్కువ స్థానాలలో సీపీఐ విజయం సాధించిందన్నారు. వందేళ్లలో ఎన్నో పార్టీలు పుట్టాయి, కనుమరుగయ్యాయి.. కానీ అధికారంలోకి రాకున్నప్పటికీ లాఠీలు, తూటాలకు ఎదురొడ్డి నిలిచిన భారత కమ్యూనిస్టు పార్టీ ఇంకా సజీవంగా ఉందన్నారు. స్వార్థం లేని పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని ఆయన చెప్పారు. అందుకే ఇన్నేళ్లు పోరాటాలు చేస్తూ నిలిచిందన్నారు. మరోసారి అధికారంలోకి రాకుంటే బీఆర్ఎస్ పార్టీ ఉండదన్నారు. సీపీఐ అధికారంలో ఉన్నా.. లేకున్నా దేశంలో పేదల కోసం నిలిచిన పార్టీ అని అన్నారు. మనిషి ఉన్నంత కాలం సీపీఐ బతికుంటుందన్నారు. ఎల్బీనగర్‌ను సీపీఐ బలమైన కోటగా మలుస్తామన్నారు. గ్రేటర్ ఎన్నికల్లో కమ్యూనిస్టుల సత్తా ఏమిటో చూపాలన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య, రాష్ట్ర కార్యవర్గసభ్యులు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, ఎల్బీనగర్ సహాయ కార్యదర్శి బాతరాజు నరసింహ, పర్వతాలు, క్రాంతి, పల్లె నర్సింహ, ప్రవీణ్, ఫైమిద, రాంనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మజీద్‌పూర్, లష్కర్‌గూడల్లో పర్యటించిన అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజా పరిపాలన దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడ, మజీద్‌పూర్ గ్రామాలను డీపైసీఓ రంగారావు, ఎంపీడీఓ శ్రీవాణితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా లష్కర్‌గూడలో ఇంకుడు గుంతల కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఉపాధి హామీ పనులను పరిశీలించారు. మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో పాటు మధ్యాహ్నం భోజన కార్మికులతో మాట్లాడారు. పంచాయతీ పారిశుధ్య ఉపాధి కూలీలను సన్మానించారు. రాజ్యాంగ దినోత్సవం గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీఓ మధుసూదనచారి, ఏఈ ఇంద్రాసేనారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, ఏపీఓ సుధాకర్, శంకర్, మాజీ సర్పంచ్ పోచంపల్లి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి హరీశ్‌రావును సన్మానిస్తున్న బీఆర్‌టీయూ అధ్యక్షుడు రాంబాబుయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ తదితరులు

జలమండలి యూనియన్ ఎన్నికల్లో బీఆర్‌టీయూను గెలిపించాలి

● కార్మికులకు మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపు

చాదర్‌ఘాట్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే జలమండలి యూనియన్ ఎన్నికల్లో బీఆర్‌టీయూను కార్మికులు గెలిపించేందుకు సిద్ధంగా ఉండాలని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం జలమండలి బీఆర్‌టీయూ అధ్యక్షుడు జి.రాంబాబు యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎల్లమయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ మేడ్చల్ శ్రీనివాస్‌తో కూడిన కార్మికుల బృందం హరీశ్‌రావును కలిసి ఘనంగా సన్మానించింది. బీఆర్ఎస్ అనుబంధ సంస్థ బీఆర్‌టీయూ రాబో యే జలమండలి ఎన్నికల్లో విజయం సాధించడం తథ్యమన్న ధీమాను మాజీ మంత్రి వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో 580 మంది సీవరేజ్ కార్మికులను పర్మినెంట్ చేసిన విషయాన్ని ఆయన వివరించారు. అదేవిధంగా సమయానికి పీఆర్‌సీ, కార్మికులకు హెల్ కార్డులు జారీ చేసిన ఘనత కూడా అప్పటి ప్రభుత్వానికే దక్కిందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మహ్మద్ జలీల్ అహ్మద్, అశ్వక్, సూర్యనారాయణ, మురళి, వినయ్‌కుమార్, షరీఫ్, యాదగిరి, రాంచంద్రారెడ్డి, వెంకటేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 26(ఆంధ్ర జ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ లెప్రసీ కాలనీ (శాంతినగర్)లో మంగళవారం ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. డాక్టర్ ఆనంద్ దివాకర్, అనిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు 220 మంది కాలనీ వాసులకు ఉచితంగా బీపీ, షుగర్, రక్త, ఎక్స్‌రే, ఈసీజీ, కంటి పరీక్షలు చేశారు. 60 మందికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. అవసరమైన వారికి మందులను అందించినట్లు క్యాంపు టీమ్ లీడర్ జంగా జయరాజ్ తెలిపారు. లెప్రసీ వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్య సేవలు అందించడంపై స్లాప్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. వడ్డేపల్లి విజయేందర్‌రెడ్డి, డాక్టర్లు భారత్, మని, వర్మ, కారష్మ, మనోజ్ఞ, శ్రీధర్ పాల్గొన్నారు.

కుటుంబ సర్వే వివరాల నమోదుకు హెల్ప్ డెస్క్

హయత్‌నగర్, నవంబరు 26(ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలు అనివార్య కారణాలతో నమోదు చేయించుకోని వారి కోసం తుర్కయంజాల్ మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్ డెస్‌ను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ అమరేందర్ రెడ్డి తెలిపారు. సర్వే సమయంలో ఇంట్లో లేని, అనివార్య కారణాలతో సర్వే వివరాలు నమోదు చేయించుకోని వారు ఈ నెల 27, 28వ తేదీల్లోగా తమ సర్వే వివరాలను తప్పని సరిగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. 9866294894 ఫోన్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.



మార్కెట్ కమిటీ డైరెక్టర్లను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మార్కెట్ కమిటీ డైరెక్టర్లకు సన్మానం

హయత్‌నగర్, నవంబరు 26(ఆంధ్ర జ్యోతి): హయత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్‌గౌడ్, బుద్దా సత్యనారాయణను మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు చెన్నగోని రవీందర్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివా స్, సుధాకర్, శ్రీనివాస్‌ముదిరాజ్, ప్రకాష్, సల్మాన్‌ఖాన్, మనోజ్, గోవర్ధన్‌నాయక్ పాల్గొన్నారు.

షిరిడీ సాయిపై అసత్య ప్రచారాలకు చరమగీతం పాడదాం

●బాబా భక్తుల ఐక్యవేదిక అధ్యక్షుడు మంచికంటి ధనుంజయ్య

మన్సూరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): షిరిడీ సాయిబాబాపై కొంత కాలంగా వస్తున్న అసత్య ప్రచారాలకు రుజువుతో చరమగీతం పడదామని షిరిడీ సాయి భక్తుల ఐక్యవేదిక అధ్యక్షుడు, చింతపల్లి సాయి సన్నిధి చైర్మన్ మంచికంటి ధనుంజయ్య బాబా భక్తులకు పిలుపునిచ్చారు. నాగోల్‌లోని దేవకి కన్వెన్షన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 400 మందికిపైగా షిర్డీ సాయిబాబా మందిరాల చైర్మన్లు, అధ్యక్షులు, ప్రధానకార్యదర్శులు, కార్యదర్శులు, ట్రెజరర్లతో హైదరాబాద్ నగరం నాగోల్‌లోని దేవకి కన్వెన్షన్ హాల్‌లో బుధవారం 9 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా షిరిడీలోని శ్రీసాయి బాబా సంస్థాన్ ముఖ్య కార్యనిర్వహణాధికారి గోరక్ష మహదేవ్ గాడిల్కర్, రిటైర్డ్ హైకోర్టు జడ్జ్ చంద్ర కుమార్‌తో పాటు పలువురు వక్తలు హాజరవుతున్నారన్నారు. సమావేశానికి వచ్చేవారు ఎలాంటి సందేహాలు ఉన్నా 8885003535 నంబర్‌లో తమను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో షిరిడీ సాయి భక్త ఐక్యవేదిక కార్యదర్శి పీవీ సాయి, కోశాధికారి గుండా మల్లయ్య, కమిటీ సభ్యులు శ్రావణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, హనుమంతు, వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ తల్లి కల్యాణం

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరు సంతోషంగా ఉండాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. పెద్దఅంబర్‌పేట్‌లోని సాయి శ్రీనివాస బాటిల్ కంపెనీలో నిర్వహించిన ఎల్లమ్మ తల్లి కల్యాణంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం దేవలయాల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో బంధుమిత్రులు, సాయి శ్రీనివాస్ కంపెనీ కార్మికులు, కాంగ్రెస్ పార్టీ నాయకులుపాల్గొన్నారు.

ఐఫోన్ కొనండని.. రూ. 80 వేలు దోచేశాడు!

●ఎల్‌బీనగర్ పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

కొత్తపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఐఫోన్ కొనండని అంటూ ఓఎల్ఎక్స్ యాప్‌లో ఎరవేసి ఓ కేటుగాడు రూ 80 వేలు దోచుకున్న ఘటన ఎల్‌బీనగర్ పీఎస్ పరిధిలో జరిగింది. ఎస్‌హెచ్ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మన్సూరాబాద్ శ్రీనివాసకాలనీ ఎంఎస్ హ్యాబిటాట్‌లో ఉండే బూరు రెశ్వంత్ గౌడ్(20) విద్యార్థి. అతడు మొబైల్‌ఫోన్ కొనాలని ఈ నెల 14న ఓఎల్ఎక్స్ యాప్‌లో సర్చ్ చేయగా ఐఫోన్ 16 ఫొటో కనిపించింది. ఆ ఫోన్ కొనేందుకు సుముఖత వ్యక్తం చేయడంతో గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌నం 9701614642 నుంచి కాల్ చేసి ఆ ఫోన్ రూ. 80 వేలకు విక్రయిస్తామన్నాడు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్ వద్దకు తన సోదరుడు ఐ ఫోన్ 16 తీసుకువస్తాడని, తనకు డబ్బు పంపితే అతను ఫోన్ అందజేస్తాడని నమ్మబలికాడు. అదే విధంగా సదరు గుర్తు తెలియని వ్యక్తి ఐ ఫోన్ 16 అసలు యజమానికి తన సోదరుడు మధ్యాహ్నం 12 గంటలకు రూ.80 వేలు ఇస్తాడనీ, ఆ ఫోన్ అతడికి ఇవ్వాలనీ మెసేజ్ పెట్టాడు. అసలు యజమాని కుస్మంత్ జయంత్ ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్ వద్దకు చేరుకుని రెశ్వంత్‌గౌడ్‌ను ఫోన్‌లో సంప్రదించాడు. అతడికి ఐ ఫోన్ 16ను చూపించగా, రెశ్వంత్‌గౌడ్ సదరు గుర్తు తెలియని వ్యక్తికి కాల్ చేసి ఐ ఫోన్‌ను కొంటానని చెప్పాడు. ఆ వ్యక్తి రెశ్వంత్‌గౌడ్ వాట్సాప్‌కు యూపీఐ క్యూ ఆర్ కోడ్‌ను పంపించగా, మూడు విడతలుగా అతడికి రూ. 80 వేలు బదిలీ చేశాడు. ఆ తర్వాత అతడు కుస్మంత్ జయంత్‌ను సంప్రదించి, డబ్బు పంపానని, ఐ ఫోన్ ఇవ్వండని కోరాడు. తనకు డబ్బు అందలేదని, సదరు గుర్తు తెలియని వ్యక్తి తనకు తెలియదని కుస్మంత్ చెప్పడంతో అసలు విషయం తెలిసి షాకయ్యాడు. ఓఎల్ఎక్స్ యాప్‌లో ఉన్న ఐ ఫోన్ 16 కు అసలు యజమాని తనేనని రెశ్వంత్‌గౌడ్‌ను నమ్మించిన గుర్తు తెలియని వ్యక్తి రూ. 80 వేలు దోచుకున్నాడు. దీంతో బాధితుడు ఎల్‌బీనగర్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, నిజానిజాలు తెలుసుకోకుండా వాట్సాప్ గ్రూపుల్లో ఎలక్ట్రానిక్ వస్తువులు విక్రయిస్తామనే గుర్తు తెలియని వ్యక్తులను సంప్రదించవద్దని, ఆన్‌లైన్‌లో డబ్బు పంపి మోసపోయిన వారు 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.

శుభకార్యానికి వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

●రూ.15 లక్షల నగదు, 12 తులాల బంగారం అపహరణ

సరూర్‌నగర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): శుభకార్యానికి వెళ్లొచ్చేసరికి ఇంట్లో దొంగలు పడి అందినికాడికి దోచుకుపోయారు. మీర్‌పేట్ పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రశాంతిహిల్స్‌లోని పింగలి అపార్ట్‌మెంట్‌లో నివసించే ఆర్.మోహన్ చారి సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లాడు. అర్ధరాత్రి దాటాక ఇంటికి తిరిగి రాగా తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. చోరీ జరిగిందని గ్రహించిన బాధితుడు మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చారి కుటుంబ సభ్యులు బయటకు వెళ్లగానే దుండగులు ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. చోరీ దృశ్యాలు, దుండగుల కదలికలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. బీరువాలో దాచిన దాదాపు రూ.15 లక్షలు నగదుతో పాటు 12 తులాల బంగారు ఆభరణాలు దుండగులు అపహరించుకుపోయినట్లు బాధితుడు పేర్కొన్నాడు. పోలీసులు సాంకేతిక ఆధారాలను సేకరించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాల ఆధారంగా దుండగుల కోసం గాలిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.

ఎలక్ట్రానిక్స్ షాప్‌లో అగ్నిప్రమాదం

● గృహోపకరణాలు దగ్ధం

సరూర్‌నగర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ బాలాపూర్ చౌరస్తాలోని ఓ ఎలక్ట్రానిక్స్ షాప్‌లో సో మవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగి షాపులోని గృహోపకరణాలు కాలిపోయాయి. పోలీ సుల కథనం ప్రకారం... బాలాపూర్ చౌరస్తాలో ఉన్న శ్రీరామ ఎలక్ట్రానిక్స్ షాపు యజమాని ప్రసాద్ సోమవారం రాత్రి ఎప్పటిలాగే దుకాణం బంద్ చేసి ఇంటికి వెళ్లాడు. రాత్రి పొద్దుపోయాక షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పెద్ద ఎత్తున మంటలు రావడంతో స్థానికులు గమనించి షాపు యజమానికి, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేశారు. కాగా అప్పటికే షాపులోని విలువైన గృహోపకరణాలన్నీ కాలిపోయాయి. బాధితుడు ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మీర్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

కబ్జాదారుల నుంచి మా ప్లాట్లను స్వాధీనం చేసుకోండి

● పిగ్లీపూర్ ప్లాట్ల బాధితుల డిమాండ్

●అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ప్లాట్ల యజమానులు

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): కబ్జాకు గురైనా తమ ప్లాట్ల (ఇంటి స్థలాల)ను తమకు తిరిగి అప్పగించి న్యాయం చేయాలని కోరుతూ అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్ ప్లాట్ల బాధితులు తహసీల్దార్ కార్యాలయం ముందు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ, సర్వే నంబర్ 12/7, 12/8, 12/9తో పాటు 17/1/ఏలో సుమారు 100 ఎకరాల్లో 1985-1991 మధ్యలో ఎన్‌బీఎన్ నాయుడు ఫేజ్-2 పేరుతో లేఅవుట్ చేశారన్నారు. అందులో సుమారు 1300 మంది ప్లాట్లను కొనుగోలు చేశామని, కొంత కా లం తర్వాత పిగ్లీపూర్‌లోని ఓ కళాశాల, ఓ రియల్ ఎస్టేట్ సంస్థ తమ ప్లాట్లను ఆక్రమించినట్లు యజమానులు పేర్కొన్నారు. 2008లో తాము కోర్టుకు వెళ్లగా తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని, అయితే కొందరు స్థానికులు (థర్డ్‌పార్టీ) తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేయడంతో పాటు ప్లాట్ల హద్దులను తొలగించారన్నారు. ఇటీవల కొందరు తమ ప్లాట్లను కబ్జా చేస్తూ ప్రీకాస్ట్ గోడలను నిర్మిస్తుండటంతో హైకోర్టును సంప్రదించగా సర్వే నంబర్ 17లోని పట్టా, భూదాన, సీలింగ్ భూమిని సర్వే చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. కోర్టు ఆదేశాలతో వారం క్రితం రెవెన్యూ అధికారులు సర్వే చేస్తామని చెప్పి అనివార్య కారణాలతో నిలిపివేశారని చెప్పారు. ఇదే అదునుగా భావించిన కొందరు కబ్జాదారులు తమ ప్లాట్లల్లో ప్రీకాస్టు గోడలను నిర్మిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్‌తో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. వెంటనే సర్వే చేసి తమ ప్లాటను తమకు అప్పగించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించామన్నారు. కాగా, వారం రోజుల తర్వాత భూమిని సర్వే చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారని ప్లాట్ల యజమానులు తెలిపారు. కార్యక్రమంలో ప్లాట్ల యజమానులు నాగభూషన్, ఆనంద్ శివరామకృష్ణ, త్రిపురాంబ, శ్రీనివాస్‌రావు, నర్సింహారావు, సుబ్బారావు, జయంత్ తదితరులు పాల్గొన్నారు.